క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మాణానికి భూమి పూజ


డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: పట్టణంలోని 14వ వార్డులో నిర్మించే డ్రెయినేజీకి మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి మంగళవారం భూమిపూజ చేశారు. బ్రిడ్జిపేటలోని చర్చివీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7.40 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్టు ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో పట్టణంలోని అన్ని వార్డుల్లోను అవసరమైన పనులు చేపడతామన్నారు. డ్రెయినేజీ నిర్మాణ పనులకు సహకరించాలని ఆ వీధి ప్రజలను ఆమె కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, వార్డు కౌన్సిలర్ చీరా అరుణకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని చైర్‌పర్సన్ రత్నకుమారి పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

నిడదవోలులో..

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణంలోని 12, 21, 27 వార్డులలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.25.54 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ నిడదవోలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, మేడపాటి సరిత, కమిషనర్ కేవీ పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఉనకరమిల్లి ముస్తాబు

నిడదవోలు రూరల్: ఉనకరమిల్లిలో సీతారాముల కల్యాణోత్సవాలను ఈనెల 30 నుంచి ఏప్రిల్ 9 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉత్సవాల కోసం చలువపందిళ్లు వేసి, భారీ విద్యుత్తు దీపాలంకరణ చేశారు. 30 ఉదయం 11.20 గంటలకు శ్రీరామచంద్రమూర్తి, సీతాదేవిలకు వైభవంగా కల్యాణం నిర్వహిస్తామన్నారు. సూర్నీడి సీతారామయ్య, విజయలక్ష్మి దంపతులచే సామూహిక కల్యాణం జరుగుతుందన్నారు. ఉత్సవాల ముగిసే వరకూ రోజూ రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

నల్లజర్ల: పోతరం-కవులూరు గ్రామాల మధ్య గల అయ్యప్పస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెంకు చెందిన వేద పండితుడు కూచిబాల కిశోర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలనుకు చెందిన పద్మనాభుని సూర్యకిరణ్, సుష్మ దంపతులు తమ కుమారుడు ధన్విన్‌కు తులాభారం మొక్కు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు కూడా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి అన్నసమారాధన జరిగింది.

రెండు గ్రామాల్లో డ్రోన్ సర్వే ప్రారంభం

నిడదవోలు రూరల్: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపట్టినట్లు తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. మండలంలోని తాడిమళ్ల, కాటకోటేశ్వరం గ్రామంలో డ్రోన్‌తో భూసర్వేను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు బయ్యే రాధారాణి, కె.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల నాగేశ్వరరరావు, పెనుగుర్తి రాము, వైఎస్సార్ సీపీ నాయకులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంకటస్వామి



నల్లజర్ల: వైఎస్సార్ సీపీ ఆవపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అచ్యుత వెంకటస్వామి (పెదకాపు)ఎంపికయ్యారు. ఆ గ్రామంలోని కొత్తపేటలో వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది.10వ వార్డు సభ్యులు మధ్యాహ్నపు నాగేశ్వరరావు, జోగినీడు నాగేశ్వరరావు, మద్దూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

41 మంది గైర్హాజరు

కొవ్వూరు: పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 705 మందికి గాను 41 మంది గైర్హాజరు కాగా 664 మంది పరీక్ష రాశారు.ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 236 మందికి గాను 22 మంది గైర్హాజరయ్యారు.ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 216 మందికి గాను 11 మంది గైర్హాజరయ్యారు. శ్రీ చైతన్య కళాశాలలో 253 మందికి గాను ఎనిమిది మంది గైర్హాజరయ్యారు.

ఆడుతూ పాడుతూ అభ్యాసం

- చిన్నారుల్లో మేధాశక్తి పెంచే వినూత్న ప్రక్రియ
- సమిశ్రగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బొమ్మల కొలువు


చిన్నారుల బోధనకు సిద్ధంగా ఉన్న ఆట వస్తువులు, బొమ్మల కొలువులు


చిన్నారులకు ఆటపాటలతో బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమారి


గోడపై తెలుగు అక్షరమాల, ఆంగ్ల అక్షరాలు..

నిడదవోలు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల వయస్సు మూడు నుంచి ఐదేళ్లు. వారికి విద్య అందించాలంటే మొదట బొమ్మలతో బోధిస్తూ వారికి చదువుపై ఆసక్తి కలిగించాలి. పాఠ్యాంశాల్లోని వస్తువులను చూపించి వారితో చెప్పించడం ద్వారా విజ్ఞానం పెంచాలి. చిన్నారుల్లో సృజనాత్మకత, అభ్యసన నైపుణ్యం పెంచేందుకు ఆట వస్తువులు, బొమ్మల కొలువులు ఎంతగానో ఉపయోగపడతాయి. నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం అరుంధతీపేటలోని నంబర్- 3 అంగన్‌వాడీ కార్యకర్త ఎంజే రత్నకుమారి చిన్నారుల్లో మేధాశక్తిని పెంచేందుకు వినూత్నంగా బోధిస్తున్నారు. అంగన్‌వాడీ భవనం లోపలి గోడలపై పిల్లలకు సులభతరంగా అర్థమయ్యేలా రంగురంగుల బొమ్మలు, ఆట వస్తువుల చిత్రాలు తయారు చేయించారు. చిన్నారులు ఆకట్టుకునే రకరకాల వస్తువులు వాటిలో ఉన్నాయి. ప్లాస్టిక్ బీడ్స్, ఫింగర్ పప్పెట్లు, రంగురంగుల మైనం పెన్సిళ్లు, బొమ్మల ముసుగులు, హ్యాపీ బర్త్‌డే బెలూన్స్, వారపు చెట్టుతో పాటు ఔరా అనిపించే కార్టూన్స్ ప్రత్యేకంగా ఆ నాలుగు గోడలపై అలరిస్తున్నాయి. వీటి ద్వారా పిల్లలకు కార్పొరేట్ కాన్వెంట్లు, ప్రీస్కూళ్లకు ధీటుగా సులభంగా, అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

చిత్రలేఖనంతో మేధాశక్తి

చిత్రలేఖనం పుస్తకాలను మూడేళ్ల పిల్లలకు ఇస్తారు. ఇందులో గీసి ఉన్న ఆకారాలపై రంగులను వేయిస్తారు. వర్క్ పుస్తకాల్లో అక్షరాలు రాయిస్తారు. దీని వల్ల చిన్నచిన్న పదాలను రాయడం, చదవడం చిన్నారులకు అలవాటు అవుతుంది. ఇలా చేస్తే పిల్లలకు ఆలోచనాశక్తి పెరిగి మేధాశక్తికి దోహదపడుతుంది. వివిధ ఆకారాల్లో ప్లాస్టిక్ బీడ్స్, వృత్తం, త్రికోణం, చతురస్రం వివిధ రంగుల్లో ఉంటాయి. ఇవి చిన్నవి, పెద్దవి ఉంటాయి. రంగులు గుర్తించమని, వాటిని వేరుచేయడం వల్ల పరిశీలన ఆసక్తి పెరుగుతుంది. గోడలపై రంగులతో రాసిన అక్షరమాల, ఏబీసీడీలు, కూరగాయలు, అంకెలు, బెలూన్ల ద్వారా బోధించడంతో చిన్నారులు ఆసక్తిగా నేర్చుకోవడం వల్ల ఆలోచనాశక్తి, నైపుణ్యం మెరుగు పడుతుంది.

ఆట వస్తువులతో విద్యాబోధన



పల్లెల్లో కాన్వెంట్లు ఎక్కువగా పెట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం తగ్గుతోంది. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం దిశగా చర్యలు తీసుకున్నారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు సృజనాత్మకత, మేధోశక్తి పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాన్ని బొమ్మల కొలువుగా తీర్చిదిద్దాను. చిన్నారులకు బొమ్మలతో బోధించడంతో ఎంతో ఆసక్తిగా వింటున్నారు. పిల్లలు ఏదైనా పాఠాన్ని సులభంగా అర్థం చేసుకుంటారు.

– ఎంజే రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, సమిశ్రగూడెం

నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి


చిలకపాడు సంపద తయారీ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీపీవో జగదాంబ

ఉండ్రాజవరం: ఈ నెలాఖరుకు కచ్చితంగా నూరు శాతం ఇంటి పన్నుల వసూలుకు అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పి.జగదాంబ ఆదేశించారు. మండలంలోని చిలకపాడు గ్రామాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఆ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఈ- సేవ కేంద్రం సేవలను ఆమె సమీక్షించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. తయారై ఉన్న 600 కిలోల వర్మీ కంపోస్ట్‌ను వెంటనే విక్రయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు, కార్యదర్శి కె.రఘునందరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పింద్రా పోచేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే లక్ష్యంగా పథకాలు


కాపవరంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు


కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ఎంపీ భరత్‌రామ్
- డ్వాక్రా మహిళలకు కానూరు, కాపవరాల్లో ఆసరా చెక్కుల పంపిణీ
- పాల్గొన్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ అన్నారు. మండలంలోని కానూరు, కాపవరం గ్రామాల్లో వైఎస్సార్ వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అక్కచెల్లెమ్మలు లక్షాధికారులు కావాలన్నదే జగనన్న సంకల్పమన్నారు. నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు రద్దు చేస్తాయని హామీ ఇచ్చిన నాటి టీడీపీ ప్రభుత్వం నెరవేర్చకుండా మహిళలను మోసగించిందన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకుని మూడో విడత రుణమాఫీ చేశారన్నారు. తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. నాడు ప్రజలు ఇసుక, మట్టి మాఫియా చేతుల్లో నలిగిపోతే నేడు అలాంటి ఇబ్బంది లేకుండా చేశామన్నారు. పెరవలి మండలంలోని 1531 డ్వాక్రా సంఘాల మహిళలకు మూడో విడతలో రూ.18.65 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. గత మూడు దఫాల్లో ఈ మండలానికి రూ.130.42 కోట్ల రుణ మాఫీ జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం ఎంపీపీ యాల్లారేశ్వరి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు సుజాత, మండల సమైఖ్య అధ్యక్షురాలు వీరమళ్ళ దుర్గ, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పెరవలిలో 104 వాహనం ప్రారంభం


జెండా ఊపి 104 నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: గ్రామీణ ప్రాంత ప్రజలకు, వారి చెంతకే వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి 104 వాహనాలను కేటాయించిందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పెరవలి మండలానికి సమకూర్చిన 104 నూతన వాహనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు వైద్యులు, సిబ్బంది ఈ వాహనాన్ని వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణవేణి, విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన అభివృద్ధి కమిటీ


డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి నూతన కమిటీ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. గౌరవాధ్యక్షురాలిగా రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఉపాధ్యక్షుడిగా వి.నెల్సన్ ఆంటోనీ, కార్యదర్శిగా అక్షయపాత్ర రష్మిత, న్యాయ సలహాదారుడిగా ఎస్.రవిబాబు, సభ్యులుగా ఆర్‌వీ కామేశ్వరశర్మ, జి.మైఖేల్ ప్రకాష్, వి.శ్రీనివాసు, ఎ.సాయిసుందర్, పి.విజయానందకుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ, పీఎంకేవీవై 4.0 లో భాగంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే వారం నుంచి కళాశాలలో బ్యూటీషియన్, టైలరింగ్ వంటి అదనపు కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు కల్పించబోయే అదనపు సౌకర్యాలు, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై సమావేశంలో చర్చించారు. ఆన్‌లైన్ ద్వారా కళాశాలలో ప్రవేశానికి విద్యార్థులకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

తాళ్లపూడి: పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 92 మంది విద్యార్థులకు మంగళవారం సాయంత్రం ఆ సంస్థ సభ్యులు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు అప్పన చంద్రగుప్త, అంకెం సురేష్, పి దుర్గాప్రసాద్, సనపల రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి సొసైటీకి రూ.7.45 కోట్ల మిగులు బడ్జెట్


సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడుశ్రీనివాస్

దేవరపల్లి: వచ్చే ఆర్థిక సంవత్సరం (2023-34)లో దేవరపల్లి సొసైటీకి రూ.7.45 లక్షల మిగులు బడ్జెట్‌ను ఆ సొసైటీ మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానికంగా మంగళవారం నిర్వహించిన మహాజన సభలో సొసైటీ కవల శ్రీనివాస్ మాట్లాడుతూ సొసైటీలో రూ.8.81 లక్షల డిపాజిట్లు ఉన్నాయన్నారు. సభ్యుల నుంచి రూ.15.61 కోట్ల రుణాలు తిరిగి రావలసి ఉన్నాయని చెప్పారు. సొసైటీ భవనం శిథిలావస్థకుచేరుకున్నందున కొత్త భవనం నిర్మాణం చేయవలసి ఉందన్నారు. యాగంటి సాయిబాబు అనే రైతు మాట్లాడుతూ సభ్యులకు షేరు ధనంపై డివిడెండ్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, డైరెక్టర్లు మంచిలి కటాక్షం, బాలం గంగాధర్, పలువరు సభ్యులు పాల్గొన్నారు. కార్యదర్శి కేఎస్ఎస్ శర్మ వార్షిక నివేదిక చదివి వినిపించారు.

క్రైం కార్నర్..

కొడుకుపై తండ్రి, కుటుంబసభ్యుల దాడి

నిడదవోలు రూరల్: ఆస్తి వివాదం నేపథ్యంలో కొడుకుపై తండ్రితో పాటు కుటుంబ సభ్యులు దాడి చేశారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈ గ్రామానికి చెందిన యర్రం సత్యనారాయణకు అతని కుమారుడు సత్తిబాబు మధ్య ఇంటి వాటా పంపకం విషయంలో గొడవలు ఉన్నాయి. దీంతో ఈనెల 27న సత్యనారాయణతో పాటు భార్య, ఇద్దరు కుమార్తెలు సత్తిబాబుపై దాడి చేశారు. దీనిపై సత్తిబాబు భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఏఎస్సై గంగాధర్ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాలకు చెందిన కారింకి నారాయణమ్మ అనే వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం పోలీసు స్టేషన్ ఏఎస్సై పరమహంస మంగళవారం తెలిపారు. ఈ గ్రామానికి చెందిన కారింకి ఆంజనేయులు, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 22న కుటుంబ సభ్యులందరూ నిద్రపోతుండగా నారాయణమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై ఆమె భర్త ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపారు. సమిశ్రగూడేనికి చెందిన సాలి శోభారాణికి జాన్ విక్టర్‌కు 2000 ఏడాదిలో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల తన భర్త జాన్ విక్టర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ శోభారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

కొవ్వూరు: సారా కేసులో పరారీలో ఉన్న తాళ్లపూడి మండలం తుపాకులగూడేనికి చెందిన రాయుడు దానయ్య అనే నిందితుడ్ని మంగళవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. నిందుతుడ్ని రిమాండ్ నిమిత్తం కొవ్వూరు కోర్టుకు హాజరు పరిచినట్టు తెలిపారు.ఎస్సై జి.బసంతి, ఇతర సిబ్బంది సహకరించారన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం వే బ్రిడ్జి వద్ద బైక్‌పై వెళుతున్న దంపతులను మరొక బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో మునిపల్లికి చెందిన కారింకి శ్రీనివాస్‌కు గాయాలైనట్టు సమిశ్రగూడెం ఏఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఈనెల 26వ తేదీన రాత్రి రాజమహేంద్రవరం వెళ్లి శ్రీనివాస్ అతని భార్య బైక్‌పై తిరిగి వస్తుండగా గోపవరం వే బ్రిడ్జి మలుపులో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఢీ కొట్టాడన్నారు. తీవ్ర గాయాలైన శ్రీనివాస్ నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్‌లు కాజేసి.. పోలీసులకు చిక్కారు

నల్లజర్ల: అనంతపల్లిలో సోమవారం రాత్రి తాళాలు పగలగొట్టి ఒక ఇంట్లోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్‌లు దొంగిలించిన ముగ్గురు వ్యక్తులు ఆనక పోలీసులకు చిక్కారు. చోరీ అనంతరం వారు వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తి, ఆయన సిబ్బంది ప్రశ్నించగా వారు పారిపోవడానికి ప్రయత్నించారు. ఎట్టకేలకు పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారిని ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ముళ్ళపూడి వినోద్‌కుమార్, గొల్లు గంగాధర్, నంబూరి లోకేష్‌లుగా గుర్తించి తాడేపల్లిగూడెం కోర్టుకు తరలించారు.

నిడదవోలులో రివర్ ఫ్రంట్ పార్కు

- రుడా నుంచి రూ.కోటి మంజూరు
- త్వరలోనే నిర్మాణానికి శ్రీకారం
- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- కౌన్సిల్ సాధారణ సమావేశంలో 20 అంశాలకు ఆమోదం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ


హాజరైన కౌన్సిల్ సభ్యులు

నిడదవోలు: పట్టణ ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే రివర్ ఫ్రంట్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుడతామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఆజెండాలో పేర్కొన్న 20 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి కృషితో రివర్ ఫ్రంట్ పార్క్ నిర్మాణానికి రుడా నిధులు రూ.కోటి మంజూరయ్యాయన్నారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని గూడెం రైల్వే గేట్ నుంచి చినకాశీరేవు వరకూ పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున ఈ పార్కు నిర్మాణానికి త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పార్కులో ప్రత్యేక వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇప్పటికే మంచినీటి పైపులైన్ పనులు పూర్తయ్యాయని, జగనన్న కాలనీతో పాటు తీరుగూడెం, జ్యోతికాలనీ, సుబ్బరాజుపేట, లింగంపల్లి ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిమిత్తం అమృత్ పథకం ద్వారా రూ.5.30 కోట్లు మంజూరయ్యాయన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలివే..

వైఎస్సార్ కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డులో బయో మైనింగ్, బయో రెమిడియేషన్ పనులు నిర్వహించేందుకు తరుణ్ అసోసియేట్స్‌కు అనుతించారు. డంపింగ్ యార్డులో కొత్త త్రీ ఫేజ్ విద్యుత్తు సర్వీస్ ఏర్పాటుకు కౌన్సిల్ రూ.5.60 లక్షలు మంజూరు చేసింది. పారిశుధ్య పనులకు కొత్తగా 30 తోపుడు బండ్లు కొనుగోలుకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.25 లక్షలు మంజూరు చేస్తూ కౌన్సిల్ ఆమోదించింది. గణపతి సెంటర్ నుంచి గణేష్ చౌక్ సెంటర్ వరకూ నిర్మిస్తున్న నాలుగు లైన్ల రోడ్డులో పాత డివైడర్, సెంట్రల్ లైటింగ్ స్థానంలో కొత్తగా ఆర్‌సీసీ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.18 లక్షలు కేటాయించింది. ఏడేళ్లుగా పట్టణంలోని ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణ ప్రైవేట్ యాజమాన్యంలో సాగింది. అగ్రిమెంట్ కాల వ్యవధి ముగియడంతో ఇక నుంచి ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణ బాధ్యతను పురపాలక సంఘం చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదించింది. సాధారణ నిధుల నుంచి రూ.8 లక్షలు కేటాయించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, టీపీఓ కె.సుజాత, ఏఈ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఊనగట్లలో అన్న సమారాధన

చాగల్లు: ఊనగట్ల మెయిన్ రోడ్డులోని పుంతలో ముసలమ్మ అనే కనక మహాలక్ష్మి అమ్మవారి ఉగాది ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి అన్న సమారాధన నిర్వహించారు. నందిగంపాడు, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పర్యవేక్షించారు.